'జగనన్నకు చెబుదాం'పై ప్రత్యేక దృష్టి


మాట్లాడుతున్న హరినారాయణన్


సమావేశంలో అధికారులు

• కలెక్టర్ హరినారాయణన్

నెల్లూరు(దర్గామిట్ట): జగనన్నకు చెబుదాం అర్జీలపై ప్రత్యేక దృష్టి సారించి అర్జీదారులు సంతృప్తి చెందేలా పరిష్కార మార్గాన్ని చూపాలని కలెక్టర్ హరినారాయణన్ సూచించారు. జగనన్నకు చెబుదాం, ఓడీఎఫ్ లక్ష్య సాధన, స్వామిత్వ పురోగతిపై ఎంపీడీఓలు, ఈఓపీఆర్డీలు, పంచాయతీ కార్యదర్శులు, ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజినీరింగ్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్‌ను కలెక్టరేట్లోని శంకరన్ హాల్ నుంచి మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో ప్రజలు అందిస్తున్న అర్జీలపై క్షేత్రస్థాయిలో పరిశీలించి, వారితో స్వయంగా మాట్లాడి పరిష్కరించాలని సూచించారు. గ్రామాల్లో వాటర్ ట్యాంకులను క్రమం తప్పకుండా శుభ్రపర్చాలని, లీకేజీల్లేకుండా స్వచ్ఛమైన తాగునీటిని అందించాలని ఆదేశించారు. సచివాలయాల్లో నీటిని తనిఖీ చేసే పరికరాలు అందుబాటులో ఉన్నాయని, వీటిని ఉపయోగించాలని చెప్పారు. క్షేత్రస్థాయిలో ప్రజలను కలిసి తాగునీటి సరఫరాపై వారి అభిప్రాయాలను తెలుసుకోవాలన్నారు. జగనన్న స్వచ్ఛ సంకల్పంలో భాగంగా ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్లను వినియోగంలోకి తీసుకురావాలని.. స్థలాల సమస్య ఉన్న చోట ప్రత్యామ్నాయం చూపి షెడ్లను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అనంతరం డీపీఓ సుస్మిత మాట్లాడారు. జగనన్నకు చెబుదాం అర్జీల్లో మూడు, ఏడు రోజుల్లో పరిష్కారం చూపాల్సిన వాటిని త్వరగా పరిష్కరించాలని తెలిపారు. ప్రతి మంగళ, గురువారాల్లో పంచాయతీ అధికారులు గ్రామాల్లో పర్యటించి సమస్యలను పరిష్కరించాలని, నీటి పైపుల లీకేజీ, చెత్త సేకరణ, తదితర కార్యక్రమాలను పర్యవేక్షించాలని ఆదేశించారు. స్వామిత్వ కార్యక్రమంలో భాగంగా 33 గ్రామాల్లో తుది ఆర్‌ఓఆర్ పూర్తయిందని, ఇక్కడ ఈ – కేవైసీని పూర్తి చేయాలని సూచించారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ రంగవరప్రసాద్, డిప్యూటీ కలెక్టర్ మహేష్, ట్రెయినీ డీపీఓ సౌజన్య, తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటి చెత్తను పక్కాగా సేకరించాలి


మాట్లాడుతున్న వెంకటరమణ


హాజరైన సిబ్బంది

నెల్లూరు(బారకాసు): నగరపాలక సంస్థ పరిధిలో ఇంటింటి చెత్తను పక్కాగా సేకరించాలని ఎంహెచ్ఓ వెంకటరమణ ఆదేశించారు. కార్పొరేషన్ కార్యాలయంలోని పురసేవా మందిరంలో శానిటేషన్ సూపర్‌వైజర్లు, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్లు, సచివాలయ శానిటేషన్ కార్యదర్శులతో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కాలువల్లో వ్యర్థాలను తొలగించి సిల్టు తీసి శుభ్రం చేయాలన్నారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని పారిశుధ్య సమస్యలు తలెత్తకుండా చూడాలని సూచించారు. మలేరియా, డెంగీ, తదితర వ్యాధులు ప్రబలకుండా తగు చర్యలు చేపట్టాలని, దీనికి సంబంధించి ఏఎన్ఎంలతో సమన్వయం చేసుకొని ఇంటింటి సర్వేను నిర్వహించాలని ఆదేశించారు. ట్రేడ్ లైసెన్స్‌ల విషయంలో ప్రత్యేక చొరవ చూపి పూర్తిస్థాయిలో చెల్లించేలా చూడాలని తెలిపారు.

ద్వారకానాథ్‌పై ఆరోపణలు అర్థరహితం


మాట్లాడుతున్న ఆర్యవైశ్య నేతలు

నెల్లూరు(బృందావనం): నుడా చైర్మన్, ఆంధ్రప్రదేశ్ ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు ముక్కాల ద్వారకానాథ్‌పై ఆరోపణలు అర్థరహితమని ఆర్యవైశ్య సంఘ నేతలు పేర్కొన్నారు. పప్పులవీధిలోని పాండురంగ అన్నదాన సమాజంలో విలేకరుల సమావేశంలో అర్బన్ ఆర్యవైశ్య సంఘ జిల్లా అధ్యక్షుడు పేర్ల సీతారామారావు మాట్లాడారు. మహాసభలో ఏ నిర్ణయమైనా సభ్యులందరి ఆమోదంతోనే తీసుకుంటారని, అధ్యక్షుడిగా వ్యవహరిస్తున్న ద్వారకానాథ్ సొంత నిర్ణయమంటూ ఏదీ ఉండదనే విషయాన్ని వారు తెలుసుకోవాలని హితవు పలికారు. నిరాధార ఆరోపణలను మానకపోతే నగరంలోని ఆర్యవైశ్యులందరూ కలిసి ఆ తొమ్మిది మందిని బహిష్కరించే రోజు వస్తుందని చెప్పారు. అనంతరం ఆంధ్రప్రదేశ్ ఆర్యవైశ్య మహాసభ కార్యదర్శి శ్రీరామ్ సురేష్ మాట్లాడారు. హైదరాబాద్‌లో గతంలో జరిగిన మహాసభ రాష్ట్ర ఎన్నికల్లో అధ్యక్షుడిగా బరిలోకి దిగిన ద్వారకానాథ్‌కు చేసిన ద్రోహం గుర్తులేదానని ప్రశ్నించారు. వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి దేవస్థాన పాలకమండలి చైర్మన్ సుంకు మనోహర్, అర్బన్ ఆర్యవైశ్య సంఘ కార్యదర్శి జ్యోతిప్రసాద్, మహిళా విభాగ జిల్లా అధ్యక్షురాలు గుండ్లపల్లి పద్మప్రియ, దేవస్థాన పాలకమండలి ప్రధాన కార్యదర్శి ఐతా రామచంద్రరావు, పాండురంగ అన్నదాన సమాజ అధ్యక్ష, కార్యదర్శులు మెంటా నరసింహారావు, వైభవ్ శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ సమస్యల పరిష్కారానికి కార్యాచరణ

• ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి


మాట్లాడుతున్న మేకపాటి విక్రమ్‌రెడ్డి

నెల్లూరు(దర్గామిట్ట): ఆత్మకూరు నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో రెవెన్యూ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక కార్యాచరణను రూపొందించాలని ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి పేర్కొన్నారు. నగరంలోని తన క్యాంప్ కార్యాలయంలో ఆత్మకూరు ఆర్డీఓ కరుణకుమారి, అన్ని మండలాల తహసీల్దార్లతో మంగళవారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. షెడ్యూల్‌ను తయారు చేసుకుంటే ప్రతి గ్రామంలో రెవెన్యూ సమస్యలు చాలా వరకు పరిష్కారమవుతాయని వివరించారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఈ నెల 23న ప్రారంభించనున్న జగనన్న సురక్ష కార్యక్రమంపై గ్రామీణ ప్రాంత ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు. ఏఎస్‌పేట, చేజర్ల, సంగం మండల కేంద్రాల్లో బస్టాండ్ల నిర్మాణాలను చేపట్టేందుకు అవసరమైన స్థల సేకరణను జరపాలని తెలిపారు. ఈ నెల 24న నిర్వహించనున్న జాబ్‌మేళాపై విస్తృత ప్రచారం చేయాలని సూచించారు. 15 కంపెనీల ఆధ్వర్యంలో 1300కుపైగా ఉద్యోగాలను కల్పించనున్నామని వెల్లడించారు.

సీపీఎం నేతల ధర్నా

నెల్లూరు(వీఆర్సీసెంటర్): జనార్దన్‌రెడ్డికాలనీలోని సబ్‌స్టేషన్ వద్ద ధర్నాను సీపీఎం ఆధ్వర్యంలో మంగళవారం చేపట్టారు. విద్యుత్ చార్జీలను తగ్గించాలని కోరారు. పార్టీ నేతలు నాగేశ్వరరావు, మూలం ప్రసాద్, పంకజ, వేణు, జాఫర్, మల్లీశ్వరి, వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

నేత్రదానం


సుభద్ర (ఫైల్)

నెల్లూరు(వీఆర్సీసెంటర్): స్టోన్‌హౌస్‌పేటకు చెందిన ఆమర్తలూరు సుభద్ర (70) మంగళవారం మృతి చెందారు. ఈ క్రమంలో కుటుంబసభ్యుల అంగీకారంతో ఆమె నేత్రాలను జిల్లా అంధత్వ నివారణ సంస్థ నేత్రదాన మోటివేటర్ బాలాజీసింగ్, ఎల్వీ ప్రసాద్ ఐ ఆస్పత్రి టెక్నీషియన్ లాలేష్ సేకరించారు. అనంతరం వారికి సర్టిఫికెట్‌ను అందజేశారు.

యోగా దినోత్సవ జయప్రదానికి పిలుపు



నెల్లూరు (టౌన్): అంతర్జాతీయ యోగా దినోత్సవానికి సంబంధించిన లోగోను నగరంలోని డీకే డబ్ల్యూ డిగ్రీ కళాశాలలో ఆయుష్ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ గిరి మాట్లాడారు. బుధవారం నిర్వహించనున్న యోగా దినోత్సవాన్ని జయప్రదం చేయాలని కోరారు. యోగా మాస్టర్లు ప్రసన్నకుమార్, అరుణకుమారి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ అధికారులు ఉమామహేశ్వరి, నాగరాజు, దివ్య, ఎన్‌సీసీ అధికారి కళాప్రియ, ఫిజికల్ డైరెక్టర్ విజయకళ, తదితరులు పాల్గొన్నారు.

ఆంజనేయస్వామికి విశేష పూజలు



పొదలకూరు : పట్టణంలోని మారుతీనగర్‌లో ఉన్న వీర అభయాంజనేయస్వామికి అర్చకులు మంగళవారం విశేష పూజలు నిర్వహించారు. పద్మశాలి సేవా సంఘం వారు ఉభయకర్తలుగా వ్యవహరించారు. ఉదయం ఆకుపూజ, అభిషేకాలు, పూజలు, మధ్యాహ్నం భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. సాయంత్రం స్వామికి పూజలు, పల్లకీసేవ గావించారు.

విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు



నెల్లూరు(బృందావనం): కొండాయపాళెం రోడ్డులోని జనహిత వాత్సల్య చిన్నారుల ఆశ్రమంలో పదో తరగతి, ఇంటర్మీడియట్, ఇంజినీరింగ్, పారా మెడికల్ కోర్సుల్లో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు, తదితరాలను మానవసేవే మాధవసేవ టీమ్ ఆధ్వర్యంలో మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వోద్యోగ సంఘ నేత, నిర్వాహకుడు చేజర్ల సుధాకర్‌రావు మాట్లాడారు. పలువురు దాతల సహకారంతో కార్యక్రమాన్ని చేపట్టామని వివరించారు. విద్య, ఉద్యోగావకాశాలపై సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లు సుకుమార్‌రెడ్డి, వినీత అవగాహన కల్పించారు. ఆశ్రమ ఆర్గనైజింగ్ సెక్రటరీ సాంబశివరావు, మానవసేవే మాధవ సేవ టీమ్ సభ్యులు కోలా రవి, కల్లం రమేష్, నారాయణ, హరిబాబు, ముత్యాల శ్రీనివాసులు, అరుణ, రాణి, సునీత, శ్రీనివాసులు, ప్రధానోపాధ్యాయుడు మధుసూదన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలపై సమీక్ష



పొదలకూరు : నెల్లూరు రూరల్ డివిజనల్ అభివృద్ధి అధికారి వసుమతి స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా గృహ నిర్మాణాలపై మంగళవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలో ఉన్న జగనన్న లేఅవుట్లలో ఇళ్ల నిర్మాణం, వ్యక్తిగతంగా నిర్మిస్తున్న ఇళ్లు తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. పక్కా ఇళ్ల మంజూరులో సమస్యలు ఉంటే వెల్లడించాలని సూచించారు. ఈ సమీక్షలో ఎంపీడీఓ నగేష్‌కుమారి, హౌసింగ్ ఏఈ శివమోహన్ పాల్గొన్నారు.

యోగాతో సృజనాత్మక శక్తి పెంపు


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న అతిథులు

నెల్లూరు (వేదాయపాళెం): యోగాతో విద్యార్థుల్లో సృజనాత్మక శక్తి పెరుగుతుందని వేదాయపాళెంలోని బ్రహ్మకుమారీస్ ఇన్‌చార్జి ప్రసన్న పేర్కొన్నారు. యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ఆరోగ్యంతో పాటు మానసిక ఒత్తిడిని నివారించేందుకు యోగా ఉపయోగపడుతుందని చెప్పారు. యోగాను చిన్నతనం నుంచి విద్యార్థులు నేర్చుకోవాలని కోరారు. యోగాను నేర్పించేందుకు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు కృషి చేయాలని పేర్కొన్నారు. తల్లిదండ్రులను వృద్ధాశ్రమాలకు పంపడం ఆవేదన కలిగిస్తోందన్నారు. అనంతరం విద్యార్థులు యోగాసనాలను ప్రదర్శించారు. తల్లిదండ్రులను సత్కరించారు. పిరమిడ్ మాస్టర్ శ్రీనివాసరావు, రచయితల సంఘ జిల్లా అధ్యక్షుడు జయప్రకాష్, రామ్మోహన్‌రావు, బ్రహ్మకుమారి నిర్మల, వెంకటేశ్వర్‌రెడ్డి, భాస్కర్, వెంకటేశ్వర్లు, వెంకటరమణయ్య, తదితరులు పాల్గొన్నారు.

యోగాతో ఆరోగ్య జీవనం

కొడవలూరు : యోగా సాధనతో ఆరోగ్యవంతమైన జీవనం సాధ్యమని గండవరం ఆయుర్వేద వైద్యశాల వైద్యాధికారిని ఎస్.గీత సూచించారు. యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని గండవరంలో విద్యార్థులతో కలిసి మంగళవారం యోగాపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నిత్య జీవితంలో యోగా ఎంతో అవసరమన్నారు. ఆరోగ్యవంతులుగా జీవించాలంటే యోగా సాధన అవసరమన్నారు. చిన్న వయస్సు నుంచే యోగాను దినచర్యగా మార్చుకోవడం వల్ల ఆరోగ్యవంతులుగా జీవించవచ్చన్నారు. హైస్కూల్ హెచ్ఎం శ్రీనివాసరావు, హిందీ పండిట్ జి.నాగభూషణం, యోగా శిక్షకులు జ్యోతి రాజేంద్రకుమార్, హిమబిందు పాల్గొన్నారు.

ఘనంగా ఏఐసీఎఫ్ వార్షికోత్సవం



నెల్లూరు(బృందావనం): వేదాయపాళెంలోని క్రిస్టియన్ అసెంబ్లీ హాల్లో ఆలిండియా క్రిస్టియన్ ఫెడరేషన్ (ఏఐసీఎఫ్) వార్షికోత్సవాన్ని మంగళవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఏఐసీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఊరందూరు సురేంద్రబాబు మాట్లాడారు. ఫెడరేషన్ జాతీయ అధ్యక్షుడు విజయరాజు ఆధ్వర్యంలో చేపడుతున్న కార్యక్రమాలను వివరించారు. అనంతరం ఏఐసీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా విడవలూరు స్వామిదాస్, దానం ప్రేమ్‌రాజ్‌ను నియమించారు. ఏఐసీఎఫ్ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు ఎలీషాకుమార్, వెంకటనాథ్, పాస్టర్స్ ఫెలోషిప్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రెవరెండ్ దాసరి రాజశేఖర్, డేవిడ్ దయాసాగర్, బర్నబాస్, పాస్టర్లు రాఘవ మోజెస్, జాన్, బాబు, ఆనందపాల్, కరుణాకర్, తదితరులు పాల్గొన్నారు.

కరాటే పోటీల్లో ఉత్తమ ప్రతిభ



నెల్లూరు (టౌన్): నేపాల్‌లో ఇటీవల నిర్వహించిన తొమ్మిదో ఎవరెస్ట్ ఇంటర్నేషనల్ కరాటే చాంపియన్‌షిప్‌లో విశ్వసాయి ఎస్సార్కే విద్యార్థి గుణిష్క దేశం తరఫున ప్రాతినిధ్యం వహించి రజత పతకాన్ని సాధించిందని పాఠశాల డైరెక్టర్ కృష్ణమోహన్ పేర్కొన్నారు. మాగుంట లేఅవుట్లోని పాఠశాలలో విద్యార్థినిని మంగళవారం అభినందించారు. ప్రిన్సిపల్ రఘురామ్, తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి


మాట్లాడుతున్న శీనయ్య

నెల్లూరు(బారకాసు): నగరపాలక సంస్థలో పనిచేస్తున్న మినిస్టీరియల్ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని నెల్లూరు కార్పొరేషన్ మున్సిపల్ మినిస్టీరియల్ ఎంప్లాయీస్ అసోసియేషన్ అధ్యక్షుడు పరుచూరి శీనయ్య పేర్కొన్నారు. కార్పొరేషన్ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మంగళవారం ఆయన మాట్లాడారు. దాదాపు 45 ఏళ్ల పాటు ఏకగ్రీవంగా ఎన్నిక జరిగిందని, ఈ క్రమంలో జూన్ 19న అసోసియేషన్‌కు మొదటిసారిగా ఎన్నికలు జరిగాయని పేర్కొన్నారు. తన ప్యానల్ 45 ఓట్లతో గెలుపొందిందని తెలిపారు. అసోసియేషన్ అధ్యక్షుడిగా తనపై బాధ్యత మరింత పెరిగిందని చెప్పారు. మున్సిపల్ మినిస్టీరియల్ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి రాజీలేని పోరాటం చేస్తామని వివరించారు. చక్రపాణి, తదితరులు పాల్గొన్నారు.

యాజమాన్యాలపై చర్యలు చేపట్టరూ..


ఏబీవీపీ నేతల ధర్నా

నెల్లూరు (టౌన్): విద్యార్థుల నుంచి అధిక ఫీజులు వసూలు చేస్తున్న ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలపై చర్యలు చేపట్టాలని ఏబీవీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి రాజశేఖర్ కోరారు. ఈ మేరకు జిల్లా విద్యా శాఖ కార్యాలయ ఎదుట మంగళవారం చేపట్టిన నిరసన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. గుర్తింపు లేని పాఠశాలలపై వెంటనే చర్యలు చేపట్టాలని కోరారు. ప్రైవేట్ పాఠశాలల్లో పుస్తకాలు, యూనిఫారం, స్టేషనరీ, తదితర పేర్లతో విద్యార్థుల నుంచి భారీగా వసూలు చేస్తున్నారని ఆరోపించారు. ఏబీవీపీ నగర కార్యదర్శి యశ్వంత్, సహాయ కార్యదర్శులు నరసింహ, సాయి, నేతలు చందు, రాహుల్, తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): నగరంలోని డీఎస్సార్ ఇండోర్ సబ్‌స్టేషన్లో నిర్మాణ పనులను చేపట్టనున్న నేపథ్యంలో పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా బుధవారం ఉండదని ఈఈ సోమశేఖర్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కేన్సర్ హాస్పిటల్, జెడ్పీ కాలనీలోని 1, 2, 3వ వీధులు, పొదలకూరు రోడ్డు, తదితర ప్రాంతాల్లో ఉదయం ఏడు నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సరఫరా ఉండదని చెప్పారు.

• హరనాథపురం జంక్షన్లో ఫ్లయ్‌ఓవర్ పనుల కారణంగా రామ్మూర్తినగర్, మినీబైపాస్ రోడ్డు, తదితర ప్రాంతాల్లో ఉదయం పది నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు సరఫరా ఉండదని తెలిపారు.

అధ్యాపకులందర్నీ క్రమబద్ధీకరించాలి

నెల్లూరు (టౌన్): ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాలల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ అధ్యాపకులందర్నీ క్రమబద్ధీకరించాలని కాంట్రాక్ట్ లెక్చరర్ల జేఏసీ రాష్ట్ర కో చైర్మన్ కల్లూరి శ్రీనివాసులు కోరారు. ఈ మేరకు గాంధీబొమ్మ సెంటర్‌లోని వైఎస్సార్ విగ్రహానికి వినతిపత్రాన్ని మంగళవారం అందజేశారు. నేతలు లలితారెడ్డి, బాలగురవయ్య, పూర్ణిమ, విజయకుమారి, సుహాసిని, సుదర్శన్, తదితరులు పాల్గొన్నారు.

యువకుడిపై దాడి

నెల్లూరు(క్రైమ్): నగరంలోని సీమా కేఫ్ సమీపంలో గల ఓ దుకాణం నుంచి యువకుడ్ని కొందరు గుర్తుతెలియని వ్యక్తులు బయటకు లాక్కొచ్చారు. అతనిపై విచక్షణరహితంగా దాడి చేసి అక్కడి నుంచి పరారయ్యారు. అనంతరం గాయపడిన యువకుడు అక్కడి నుంచి వెళ్లిపోయాడు. కాగా ఘటనపై పోలీసులకు ఎలాంటి ఫిర్యాదు అందలేదు.

నటుడికి సత్కారం



నెల్లూరు(బృందావనం): తెలుగు, తమిళ, కన్నడ, తదితర భాషల్లో 120కుపైగా చిత్రాల్లో నటించిన నళినీకాంత్‌ను భక్తవత్సలనగర్‌లోని శ్రీరామరాజు చారిటబుల్ ట్రస్ట్ కార్యాలయంలో మంగళవారం సత్కరించారు. ట్రస్ట్ నిర్వాహకుడు శ్రీరామరాజు, మురళీమోహన్‌రాజు ఆహ్వానం మేరకు నగరానికి ఆయన విచ్చేశారు. ఎస్సార్ ఆర్ రెడ్డి, దండు ధర్మారెడ్డి, ప్రభాకర్, అంకమరాజు, లక్ష్మణ్, రమేష్‌రాజు, తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

భూసార పరీక్షలతో సత్ఫలితాలు



తోటపల్లిగూడూరు : భూసార పరీక్షలతో వరి సాగులో సత్ఫలితాలు సాధించవచ్చని ఇందుకూరుపేట డివిజనల్ వ్యవసాయ సహాయ సంచాలకుడు డాక్టర్ రాజ్‌కుమార్ తెలిపారు. మండలంలోని ఈదూరు రైతు భరోసా కేంద్రంలో మట్టి నమూనాల సేకరణ, భూసార పరీక్షలపై వ్యవసాయశాఖ సిబ్బందికి శిక్షణ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీఏ రాజ్‌కుమార్ మాట్లాడుతూ వ్యవసాయంలో భూసార పరీక్షలు తప్పనిసరిగా చేయించుకోవాలని సూచించారు. వీటి ఆధారంగా వరిపంటకు ఎరువులను సిఫార్సు చేయవచ్చన్నారు. పరీక్ష ఫలితాల ఆధారంగా పంటలకు నత్రజని, భాస్వరం, పొటాష్, సూక్ష్మపోషక ఎరువు మోతాదును సూచిస్తామని వెల్లడించారు. అలాగే సమస్యాత్మక భూములతో పాటు ఆమ్ల, క్షార భూములను గుర్తించ వచ్చన్నారు. అనంతరం అధికారులు ఈదూరు రైతు భరోసా కేంద్రం పరిధిలోని పంటపొలాల్లో భూసార పరీక్షలు నిర్వహించి మట్టి నమూనాలను సేకరించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి శిరీషారాణి, ఏఈఓ, సచివాలయాల వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

గ్రావెల్ తవ్వకాలపై పరిశీలన

బుచ్చిరెడ్డిపాళెం: నగర పంచాయతీ పరిధిలోని వవ్వేరుకు సమీపంలో ఉన్న కనిగిరి రిజర్వాయర్ ప్రాంతంలో ఇటీవల గ్రావెల్ తవ్వకాలు జరిపిన ప్రాంతాన్ని లోకాయుక్త జ్యుడిషియల్ రిజిస్ట్రార్ గంగరాజు మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా సర్వే నంబర్ 920లో అక్రమంగా గ్రావెల్ తరలిస్తున్నట్లు వవ్వేరుకు చెందిన రమణారెడ్డి అనే వ్యక్తి లోకాయుక్తలో ఫిర్యాదు చేయగా పరిశీలించామన్నారు. ఈ నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తామన్నారు. ఆయన వెంట తహసీల్దార్ సుధీర్, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

డిగ్రీ కళాశాల ఏర్పాటుకు వినతి



వెంకటాచలం : వెంకటాచలం మండల కేంద్రంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలను ఏర్పాటు చేయాలని కోరుతూ ఎస్ఎఫ్ఐ జిల్లా నేతలు విక్రమ సింహపురి యూనివర్సిటీ రిజిస్ట్రార్ రామచంద్రారెడ్డికి మంగళవారం వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వెంకటాచలం, మనుబోలు మండలాల్లో డిగ్రీ కళాశాల లేదని, దీనివల్ల ఇంటర్మీడియట్ ఉత్తీర్ణులైన విద్యార్థులు డిగ్రీ చదివేందుకు నెల్లూరు, గూడూరు వెళ్లాల్సి వస్తోందన్నారు. ఇది పేద విద్యార్థులకు ఇబ్బందిగా మారుతోందన్నారు. ఈ రెండు మండలాలకు అనుకూలంగా వెంకటాచలంలో డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలన్నారు. అలాగే ప్రైవేటు కళాశాలల్లో విద్యను వ్యాపారంగా మారుస్తూ విద్యార్థుల నుంచి అధిక ఫీసులు వసూలు చేస్తున్నారని, వీటిని అదుపు చేయాలని కోరారు. ఎస్ఎఫ్ఐ నేతలు కిరణ్‌కుమార్, పవన్, సుకుమార్, బాలాజీ, రత్నంరాజు పాల్గొన్నారు.

పాఠశాల స్థాయిలోనే ప్రతిభకు ప్రోత్సాహం

కొడవలూరు : పాఠశాల స్థాయిలోనే విద్యార్థుల ప్రతిభకు ప్రభుత్వం తగిన ప్రోత్సాహం అందిస్తోందని హెచ్ఎం జి.శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని గండవరం జెడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన సాయి వివేక్, పవన ఆదిత్య, స్నేహలను 'జగనన్న ఆణిముత్యాలు' కార్యక్రమంలో భాగంగా మంగళవారం పాఠశాలలో సత్కరించారు. వైఎస్సార్‌సీపీ నేత అడపాల మోహనకృష్ణతో పాటు హెచ్ఎం చేతులమీదుగా విద్యార్థులకు నగదు పురస్కారం, మెరిట్ సర్టిఫికెట్, మెడల్ అందించారు. అనంతరం వారు మాట్లాడుతూ నియోజకవర్గ, జిల్లా, రాష్ట్ర స్థాయిలోనే కాకుండా పాఠశాల స్థాయిలోనూ విద్యార్థులను నగదు పురస్కారాలతో సత్కరించడం ఇదే ప్రథమమన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కమిటీ చైర్‌పర్సన్ రహమతున్నీసా, స్టాఫ్ సెక్రటరీ గుంజి నాగభూషణం, ఉపాధ్యాయులు శ్రీనివాసులు, సురేష్, శ్యామ్, వైఎస్సార్‌సీపీ నేత షేక్.ముజీర్ పాల్గొన్నారు.

ముత్తుకూరు : బ్రహ్మదేవి జెడ్పీ హైస్కూల్‌లో 'జగనన్న ఆణిముత్యాలు' కార్యక్రమంలో భాగంగా 2022–23 సంవత్సరంలో పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను మంగళవారం సత్కరించారు. ఈ సందర్భంగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన సీహెచ్ మనోజ్ఞప్రభ, వెంకట చాందిని, చెంగల ధరణిప్రియలకు నగదు, మెడల్స్, ప్రశంసాపత్రాలు బహూకరించారు. హెచ్ఎం తాన్య, పూర్వ హెచ్ఎం సాయిప్రసాద్, పేరెంట్స్ కమిటీ చైర్మన్ వెంకటరమణ, మాజీ సర్పంచ్ కట్టా సుబ్రహ్మణ్యం, క్లస్టర్ రిసోర్స్ పర్సన్ శివబాబు తదితరులు పాల్గొన్నారు.